క్లుప్తంగా

పెందుర్తి సీహెచ్‌సీ పరిధిలో డీఎంహెచ్‌వో పర్యటన

మహారాణిపేట: జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు పెందుర్తి సీహెచ్‌సీ పరిధిలోని గుర్రంపాలెం,అక్కిరెడ్డిపాలెం విలేజ్ హెల్త్ క్లినిక్‌లను సందర్శించారు. అక్కడ సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం పెందుర్తి సీహెచ్‌సీలో వైద్యులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైరిస్క్ గర్భిణులను గుర్తించి వారికి చికిత్స అందజేయాలన్నారు. ఏఎన్‌ఎంలు అంతా ఎన్‌సీడీ సర్వే వివరాలు పూర్తిస్థాయిలో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పర్యవేక్షించి, ప్రతి బుధవారం,శనివారం అమలు చేయాలని ఆదేశించారు. వలస వచ్చిన వారు,వెళ్లిన వారు, ప్రమాదకర కేసులపై ఎఫ్‌డీపీ నోడల్ అధికారికి ఎప్పటికప్పుడు నివేదిక సమర్పించాలని ఆదేశించారు.

కొనసాగుతున్న నిరవధిక దీక్షలు

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టులో పని చేస్తున్న కార్మికులకు జీతాలు పెంచాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.ఎం. శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గంగవరం పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక దీక్షలు బుధవారం రెండో రోజూ కొనసాగాయి. ఈ శిబిరాన్ని సందర్శించిన శ్రీనివాస్ మాట్లాడుతూ విధుల నుంచి తొలగించిన వారిని మళ్లీ విధుల్లోకి తీసుకునే వరకూ పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. 64వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవింద్ మాట్లాడుతూ పోర్టు యాజమాన్యం స్పందించి నిర్వాసిత కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ప్రగతిశీల కార్మిక సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి కొండారెడ్డి, అన్నపూర్ణ, భారత్ బచావ్ జిల్లా కార్యదర్శి డాక్టర్ పొన్నాడ శ్రీనివాస్, గంగవరం పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ ఉపాధ్యక్షుడు కొవిరి అప్పలరాజు, ప్రధాన కార్యదర్శి నొల్లి తాతారావు, కోశాధికారి వాసుపల్లి ఎల్లాజీ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించాలని వినతి

పరవాడ: రావాడ పంచాయతీలో ఆక్రమణలకు గురైన ప్రభుత్వ స్థలాలను కాపాడాలని టీడీపీ నాయకులు తహసీల్దారు పి.కనకారావును కోరారు. ఈ మేరకు వారు బుధవారం వినతి పత్రం అందజేశారు. నాయకులు మొల్లి గంగాధర్, సారిపల్లి జోగినాయుడు ఉన్నారు.

మహిళ అదృశ్యం


అపర్ణ (ఫైల్)

సింహాచలం: మహిళ అదృశ్యంపై పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఏఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాలు.. పులగానిపాలేనికి చెందిన పూజారి అపర్ణ(29) తొమ్మిది నెలలుగా వేరుగా ఉంటూ ఇటీవల తిరిగి భర్త మోసెస్ వద్దకు వచ్చింది. ఈ నెల 3వతేదీన సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆమె భర్త మోసెస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

10న షిప్‌యార్డు కో-ఆపరేటివ్ త్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ ఎన్నికలు

సింధియా: హిందూస్థాన్ షిప్‌యార్డ్ వర్కర్స్ కో-ఆపరేటివ్ త్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ పాలకవర్గం ఎన్నికలు ఈ నెల 10వ తేదీన నిర్వహించనున్నారు. నామినేషన్ల ప్రక్రియ సోమవారంతో ముగియగా బుధవారం నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ పూర్తయింది. ఈ ఎన్నికల్లో 9 మంది డైరెక్టర్ల స్థానాలకు 44 మంది నామినేషన్లు వేశారు. ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ, ఏఐటీయూసీ, జనసేన యూనియన్లు ఒంటరిగా పోటీ చేస్తున్నాయి. ఐఎన్‌టీయూసీ అన్ని స్థానాల్లో పోటీ చేస్తుండగా, సీఐటీయూ, ఏఐటీయూసీ, జనసేన ఆరు స్థానాల్లో పోటీ చేస్తున్నాయి. ఇక వైఎస్సార్ టీయూసీ, టీఎన్‌టీయూసీ, బీఎంఎస్ యూనియన్లు ఉమ్మడిగా పోటీలోకి దిగుతున్నాయి. మొత్తం 8 జోన్లుగా ఎన్నికలు నిర్వహిస్తారు. 10వ తేదీన ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ ఉంటుంది. అదే రోజు సాయంత్రం అధికారులు ఫలితాలు వెల్లడిస్తారు.

నేడు పెంపుడు కుక్కలకు టీకాలు

సబ్బవరం: ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా గురువారం పెంపుడు కుక్కలకు ఉచితంగా ర్యాబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేయనున్నట్టు సబ్బవరం ప్రాంతీయ పశువైద్య కేంద్రం సహాయ సంచాలకురాలు ఉషా కుమారి తెలిపారు.మండలంలో సబ్బవరం ప్రాంతీయ పశువైద్య కేంద్రంతో పాటు అంతకాపల్లి,గుల్లేపల్లి, ఆరిపాక పశువైద్య కేంద్రాల్లో ఈ టీకాలు వేస్తారని చెప్పారు. పెంపుడు కుక్కలు ఉన్న వారందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

'జగనన్న సురక్ష'తో ప్రజలకు మేలు


అసకపల్లిలో ధ్రువపత్రాలు అందజేస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ తుంపాల, ఎంపీపీ సూర్యకుమారి

సబ్బవరం: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం కల్పించిన మరో అవకాశమే జగనన్న సురక్ష కార్యక్రమం అని ఎంపీపీ బోకం సూర్యకుమారి అన్నారు.మండలంలోని అసకపల్లి,పైడివాడ అగ్రహారం సచివాలయాల్లో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాల్లో ఆమె మాట్లాడారు. అర్హత ఉన్నా సంక్షేమ పథకాలు పొందేందుకు ఎదురవుతున్న పలు సాంకేతిక సమస్యలను పరిష్కరించడంతో పాటు అవసరమైన పలు రకాల ధ్రువీకరణ పత్రాలు ప్రభుత్వమే ఉచితంగా అందిస్తుందన్నారు. దీనికోసం ప్రతి సచివాలయం పరిధిలోని వలంటీర్లు,సచివాలయ సిబ్బందితో పాటు మిగిలిన ప్రభుత్వ యంత్రాంగం ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను గుర్తించి వాటిని సకాలంలో పరిష్కరిస్తుందని తెలిపారు.జెడ్పీ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావుతో కలిసి ఆమె లబ్ధిదారులకు పలు రకాల ధ్రువ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జగనన్న సురక్ష నియోజకవర్గ ఇన్‌చార్జి కొటాన రాము,వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్,మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు కాపుశెట్టి శేషుబాబు,తహసీల్దార్ సత్యనారాయణ,ఎంపీడీవో రమేష్ నాయుడు,సర్పంచ్ కర్రి నరసింగరరావు, ఎంపీటీసీ కర్రి అప్పారావు,ఎంఎల్‌వో హేమంత్,పార్టీ సీనియర్ నాయకుడు బలిరెడ్డి కనకరాజు,సచివాలయ కన్వీనర్లు కాపుశెట్టి నీలవేణి,పెచ్చేటి రమేష్,మామిడి కొండాజీ, ఈవోఆర్‌డీ మహేష్, డిప్యూటీ తహసీల్దార్ వెంకట్‌తో పాటు మండల స్థాయి అధికారులు,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సత్వర న్యాయం


అర్హులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న నక్క కనకరాజు తదితరులు

సింహాచలం: అర్హులైనవారందరికీ ప్రభుత్వ పథకాలు, 11 రకాల సర్టిఫికెట్లు అందజేయడమే జగనన్న సురక్ష కార్యక్రమం లక్ష్యమని వైఎస్సార్‌సీపీ పెందుర్తి మండల అధ్యక్షుడు, మండల జేసీఎస్ ఇన్‌చార్జి నక్క కనకరాజు అన్నారు. గొరపల్లి గ్రామ సచివాలయంలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కనకరాజు మాట్లాడుతూ పలు కారణాల వల్ల సంక్షేమ పథకాల అందని వారిని గుర్తించేందుకు జగనన్న సరక్ష కార్యక్రమం ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఇప్పటికే గ్రామంలో ఇంటింటికీ సచివాలయ సిబ్బంది తిరిగి కుల, ఆదాయ, కుటుంబ, రైస్ కార్డులకు సంబంధించి సుమారు 860 దరఖాస్తులు తీసుకోవడం జరిగిందన్నారు.ఈ సందర్భంగా పలువురికి సర్టిఫికెట్లు అందజేశారు.కార్యక్రమంలో సర్పంచ్ గొరపల్లి శ్రీనివాసరావు, అధికారులు,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ రంగానికి పెద్దపీట


రైతులకు వరి విత్తనాలు అందజేస్తున్న వైస్ ఎంపీపీ గోవింద్‌తో, సర్పంచ్ నారాయణమూర్తి

సబ్బవరం: వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం రైతులను అన్ని విధాలా ప్రోత్సహిస్తుందని అంతకాపల్లి సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి అన్నారు. మండలంలోని అంతకాపల్లి రైతు భరోసా కేంద్రంలో బుధవారం రైతులకు రాయితీపై వరి విత్తనాలు అందజేశారు. ఈ సందర్భంగా నారాయణమూర్తి మాట్లాడుతూ రైతులకు అవసరమైన విత్తనాలు,ఎరువులు,క్రిమిసంహారక మందులు రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులోకి తెస్తామన్నారు. సోనామసూరి,సాంబామసూరి,శ్రీకాకుళం సన్నాలు వంటి రకాలు ఇప్పటికే అందుబాటులో ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్, మాజీ సర్పంచ్ సబ్బవరపు దేముడు బాబు,వైస్ సర్పంచ్ గొర్లి అప్పారావు, పంచాయతీ కార్యదర్శి రవి,సచివాలయ కన్వీనర్ గొర్లి ఎర్రినాయుడు, వార్డు మెంబర్లు జక్కాన శ్రీనివాసరావు, ఎం. పైడితల్లి, గొంప వరలక్ష్మి, కొల్లి దాసు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిత


గ్రేడింగ్ టెస్ట్‌లకు హాజరైన వారితో సర్పంచ్ సుజాతముత్యాలు

పరవాడ: క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ముత్యాలమ్మపాలెం సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు అన్నారు. అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని గ్రామంలో బుధవారం బ్రూస్లీరాజ్ ఒలింపిక్స్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ14వ బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె అకాడమీ జెండాతో పాటు 2023 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. క్రీడల్లో రాణిస్తే భవిష్యత్‌లో మంచి విద్యా అవకాశాలతో పాటు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో కరాటే గ్రాండ్ మాస్టర్ ఎస్. నూకరాజు, కరాటే మాస్టర్లు ఓ.ప్రసాద్, జి.పుష్పారావు, సీహెచ్.అప్పలరాజు, ఎ.అప్పలరాజు పాల్గొన్నారు.

'పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి'

పెదగంట్యాడ: పెన్షనర్లకు కనీస పెన్షన్ రూ.9వేలు ఇవ్వాలని ఆల్ పర్సనల్ రిటైర్డ్ పెన్షనర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కణితి అప్పలరాజు కోరారు. పెదగంట్యాడ సీడబ్ల్యూసీలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెన్షనర్లకు వైద్య సౌకర్యం కల్పించాలని, రైలు ప్రయాణాల్లో 50శాతం రాయితీ ఇవ్వాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి హుస్సేన్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. సమావేశంలో దీనబంధు, గురునాథ్, నమ్మి అప్పలనాయుడు, పెంటారావు పాల్గొన్నారు.

ఉక్కు భద్రతా విభాగాధిపతికి అభినందనలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ భద్రతా విభాగాధిపతి డి.రామ్‌ప్రసాద్‌ను స్టీల్ హెచ్ఎంఎస్ నాయకులు అభినందించారు. నూతన విభాగాధిపతిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా యూనియన్ నాయకులు ఆయన్ను కలిసి సత్కరించారు. యూనియన్ అధ్యక్షుడు డి. అప్పారావు, ప్రధాన కార్యదర్శి జి.గణపతిరెడ్డి, పోలయ్య, ఈశ్వరరావు పాల్గొన్నారు.

నేడు సహస్ర తులసి దళార్చన

డాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్ర నామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబరును 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

కల్యాణం.. కమనీయం


జీలకర్రబెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు


పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం బుధవారం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం,జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

ఘనంగా చందు యాదవ్ పుట్టినరోజు వేడుకలు


ఎమ్మెల్యే అదీప్‌రాజ్, పార్టీ నాయకుల సమక్షంలో కేక్ కట్‌చేస్తున్న చందు యాదవ్

సింహాచలం: జీవీఎంసీ 94,95వ వార్డుల వైఎస్సార్‌సీపీ నాయకుడు, అనకాపల్లి జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ కొరాడ చందుయాదవ్ పుట్టినరోజు వేడుకలు బుధవారం పురుషోత్తపురంలో ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ ఈ వేడుకల్లో పాల్గొని చందుయాదవ్‌కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో చందుయాదవ్ కేక్ కట్‌చేశారు. కార్యక్రమంలో 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు బైలపూడి భగవాన్ జయరామ్, 94వవార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఆదిరెడ్డి మురళి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుల చెంతకు మహిళ

గోపాలపట్నం: పాత గోపాలపట్నం ప్రాంతంలో అనుమానాస్పదంగా కనిపించిన మహిళను కుటుంబ సభ్యుల చెంతకు గోపాలపట్నం పోలీసులు చేర్చారు. పోలీసులు తెలిపిన వివరాలు.. పాత గోపాలపట్నం ప్రాంతంలో మహిళ అనుమానాస్పదంగా కనపడడంతో పోలీసులకు స్థానిక సచివాలయ మహిళా పోలీస్ సమాచారమిచ్చింది. దీంతో ఎస్ఐ రామకృష్ణ ఆ మహిళ వివరాలు సేకరించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగుడ మండలం గుంతగన్నెల గ్రామానికి చెందిన బాకు కుమారిగా గుర్తించారు. భర్తతో గొడవ పడి ఇంటి నుంచి బయటకు వచ్చిందని సీఐ ఈదుల నరసింహారావు తెలిపారు. డుంబ్రిగుడ పోలీసులకు సమాచారమివ్వడంతో మహిళ తండ్రి గోపాలపట్నం స్టేషన్ వచ్చారు. దీంతో ఆమెను తండ్రికి అప్పగించారు.

చేనేత, హస్తకళా ప్రదర్శన ప్రారంభం

ఉక్కునగరం: చేనేత, హస్త కళలను ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపై ఉందని స్టీల్‌ప్లాంట్ అంబేడ్కర్ కళాక్షేత్రం కమిటీ కార్యదర్శి నర్సింగరావు అన్నారు. భావనా రుషి చేనేత హస్త కళా కార్మిక సేవా సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన చేనేత, హస్తకళా ప్రదర్శనను బుధవారం ఆయన ప్రారంభించారు. సేవా సంఘం నిర్వాహకులు ఎ. సింహాద్రి, బి. సురేష్ మాట్లాడుతూ పోచంపల్లి, నారాయణపేట, ఉప్పాడ, చీరాల, మంగళగిరి, కలంకారి, ఫ్యాన్సీ, ఖాదీ, కాటన్ ప్రింటెడ్, బెంగాల్ సిల్క్, కాంతా వర్క్ కాటన్, భాగల్‌పూర్ సిల్క్, బాంధిని సిల్క్, గుజరాత్ డిజైన్ టాప్స్, లక్నో చికెన్ వర్క్స్, డోర్ కర్టెన్లు, డోర్ మ్యాట్లు, వరంగల్ టవల్స్ అండ్ బెడ్‌షీట్లు, రాజస్థానీ ప్రింటెడ్ టాప్స్, జైపూర్ టాప్స్, బెడ్‌షీట్లు, ఖాదీ షర్ట్స్, సారంగాపూర్ వుడ్ ఐటమ్స్ ప్రదర్శనలో ఉంచామన్నారు. ఈ నెల 23 వరకు ప్రదర్శన ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కళాక్షేత్రం ప్రతినిధులు త్రినాథ్, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణతో దేశ ఆర్థికవ్యవస్థ పతనం


874వ రోజు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: దేశ ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వరంగ సంస్థలే ఆధారమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయ కులు అన్నారు. అటువంటి సంస్థలను ప్రైవేటీకరణ చేయడం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ పతనమవుతుందని పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 874వ రోజు బుధవారం సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికవర్గాన్ని, నిర్వాసితులను, నిరుద్యోగులను నడిరోడ్డుపై పడేసే విధంగా కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందన్నారు. ఆ దుశ్చర్యలను ఉద్యమాల ద్వారా అడ్డుకుంటామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

అలరించిన కవి సమ్మేళనం


మాట్లాడుతున్న రచయిత కె.జి.వేణు

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ప్రిజమ్ కళాశాలలో జరిగి న కవి సమ్మేళనం అందరినీ అలరించింది. ప్రధాన వక్త రచయిత కె.జి.వేణు మాట్లాడుతూ సామాజిక బాధ్యతల్లో మనో వైజ్ఞానిక అంశాల పరిష్కారం దిశగా కవులు రచనలు చేయాలని సూచించారు. కవిత్వం ఒక మిత్రుడి వంటిదని, సర్వ కాలాల్లో ఆదరణ పొందుతుందన్నారు. ప్రముఖ కవి ముక్తుం మొహియుద్దీన్ గురించి సభకు పరిచయం చేశారు. సభాధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ భాష సంస్కృతుల వికాసానికి, ఉన్నతికి కవులు, రచయితలు కృషి చేయాలన్నారు. వివిధ కవిత్వ ప్రక్రియల్లో నవ కవిత అందరినీ అలరించేలా ఉండాలని పేర్కొన్నారు. కవి సమ్మేళనంలో చిన సూర్యనారాయణ, బి.రాధారాణి, కె.వి.ఎస్.మూర్తి, డి.వి.సూర్యారావు, కుప్పిలి భీమేశ్వరరావు, రామతాత వివిధ అంశాలపై చదివిన కవితలు అలరించాయి.

యాదవ కమ్యూనిటీ భవనానికి శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: జీవీఎంసీ 94వవార్డు పురుషోత్తపురంలో యాదవ కమ్యూనిటీ భవన నిర్మాణానికి పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఇటీవల గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తవడంతో అభివృద్ధి నిధులు మంజూరయ్యాయి. వాటిలో రూ.19లక్షలతో యాదవ కమ్యూనిటీ భవన నిర్మాణం చేస్తున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో 95వవార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు, 94వవార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఆదిరెడ్డి మురళి, వైఎస్సార్‌సీపీ నాయకుడు బైలపూడి భగవాన్ జయరామ్, సింహాచలం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు ప్రత్యేక ఆహ్వానితుడు కొరాడ చందు యాదవ్, పార్టీ నాయకులు వర్మ, ఆబోతు శ్రీను, ఎలమంచిలి శ్రీను, బాలమురళి, శ్రీకాంత్, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..


మోటూరువానిపాలెంలో ప్రభుత్వ స్థలంలో కంటైనర్‌ను తొలగిస్తున్న అధికారులు

పరవాడ: మండలంలోని రావాడ శివారు మోటూరు వానిపాలెంలో ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు స్పందించారు. గత నెల 22న ప్రభుత్వ స్థలంలో ఆక్రమణలు శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. మోటూరువానిపాలెం కూడలిలో ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన కంటైనర్, ఓ షాపు, కొండ బంజరులో నిర్మించిన అక్రమ కట్టడాలను బుధవారం పరవాడ పోలీసుల సహాయంతో రెవెన్యూ అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా స్థానిక టీడీపీ నాయకులకు అధికారులకు మధ్య కొంత సేపు వాగ్వాదం చోటుచేసుకొంది. టీడీపీ కార్యకర్త ఏర్పాటు చేసుకున్న పాన్‌షాపును తొలగించడం అన్యాయమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు వియ్యపు చిన్న, మాజీ ఎంపీటీసీ సారిపల్లి జోగినాయుడు ఆరోపించారు. పార్టీలకు అతీతంగా గ్రామ రెవెన్యూలో ఆర్ అండ్‌బీ, ప్రభుత్వ స్థలాల్లో ఉన్న అన్ని ఆక్రమణలను తొలగించాలని చిన్న సీఐ పి.ఈశ్వరరావు, ఆర్ఐ శ్రీలేఖతో వాగ్వాదానికి దిగారు. కార్యక్రమంలో ఎస్ఐ సిరపరపు సురేష్, వీఆర్ఏలు, వీఆర్వోలు పాల్గొన్నారు.

డస్ట్ అలవెన్స్ పెంచాలని ధర్నా


ఎన్టీపీసీ ఎదుట ధర్నాకు దిగిన కాంట్రాక్టు కార్మికులు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు డస్ట్ అలవెన్స్ పెంచుతూ వెంటనే అగ్రిమెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం బుధవారం ఎన్టీపీసీ ప్రధాన గేటు ముందు ధర్నా నిర్వహించారు. ధర్నాలో గనిశెట్టి మాట్లాడుతూ డస్ట్ అలవెన్స్ ఏళ్ల తరబడి పెంచకపోవడం దుర్మార్గమన్నారు. మెడికల్ టెస్ట్‌ల పేరుతో కార్మికులను వేధింపులకు గురిచేయడం, నిలిపివేయడం అన్యాయమన్నారు. కార్మికులకు మంజూరు చేసే ఐడీ కార్డులో ఎన్టీపీసీ లోగోను తొలగించడం కాంట్రాక్టు కార్మికులను యాజమాన్యం చులకన చేయడమేనన్నారు. యాజమాన్యం విభజించు పాలించు విధానాన్ని విడనాడాలన్నారు. తక్షణమే కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని గనిశెట్టి హెచ్చరించారు. ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మిక యూనియన్ అధ్యక్షుడు పి.పి.నాయుడు, ఉపాధ్యక్షులు పి.గోవిందరాజు, ఎం.సత్యనారాయణ పాల్గొన్నారు.

పోగొట్టుకున్న నగదు బ్యాగ్ అందజేత


నగదు బ్యాగ్‌ను పాత్రుడుకు అందజేస్తున్న క్రైం ఎస్ఐ సల్మాన్ బేగ్

సింహాచలం: ఓ వృద్ధుడు నగదుతో ఉన్న బ్యాగ్ పోగొట్టుకున్నాడు. ఈ కేసులో పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి వృద్ధుడికి తిరిగి ఆ బ్యాగ్ అందజేశారు. పెందుర్తి క్రైం పోలీసులు తెలిపిన వివరాలు.. జీవీఎంసీ 94వవార్డు పరిధి నాయుడుతోటకు చెందిన రిటైర్డ్ హెడ్ మాస్టర్ పి.ఎస్.పాత్రుడు ఇంటి నుంచి నాయుడుతోటలోని చర్చికి ఆటోలో వెళ్లారు. అక్కడ ఆటో దిగి బ్యాగ్ మరిచిపోయాడు. ఆ బ్యాగ్‌లో రూ.20వేల నగదు ఉండడంతో పెందుర్తి క్రైం పోలీసులను ఆశ్రయించారు. క్రైం ఎస్ఐ సల్మాన్ బేగ్ కేసును ఛాలెంజ్‌గా తీసుకున్నారు. వృద్ధుడు ప్రయాణించిన ఆటో గురించి కమాండ్ కంట్రోల్ ద్వారా సీసీ కెమెరాల్లో గుర్తించారు. ఇదిలావుండగా ఆటో డ్రైవర్ మళ్లీ చర్చి వద్దకు వచ్చి ఆ బ్యాగ్‌ను చర్చికి సమీపంలోని కూరగాయల వ్యాపారికి అందజేశాడు. పోలీసులు ఆటో డ్రైవర్‌ను గుర్తించడంతో వ్యాపారి వద్ద ఉన్న బ్యాగును పోలీసులకు అప్పగించాడు. ఎస్ఐ సల్మాన్ బేగ్ బాధితుడికి నగదు ఉన్న బ్యాగ్ అందజేశారు.

రేపు జాబ్‌మేళా


జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి తదితరులు

పెదగంట్యాడ: స్టీల్‌సిటీ న్యూ ఐటీఐలో ఈ నెల 7న జాబ్ మేళా నిర్వహించనున్నామని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తెలిపారు. జాబ్‌మేళా పోస్టర్‌ను స్థానిక టీఎన్ఆర్ ఫంక్షన్ హాల్లో బుధవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యమన్నారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్ చదువుకున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రీజనల్ స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి రోహిణి వివరాలను వెల్లడించారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు 11 ప్రముఖ కంపెనీల్లో సుమారు 500 పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయని తెలిపారు. 18 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాల వయసు వారు అర్హులన్నారు. అభ్యర్థులు ఫార్మల్ డ్రెస్ వేసుకోవాలని సూచించారు. అడ్మిట్ కార్డు, ఒరిజినల్ సర్టిఫికెట్లు, పాస్‌పోర్టు సైజు ఫొటో తీసుకురావాలని తెలియజేశారు. ఆసక్తి గల విద్యార్థులు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 9014772885, 9848438254 నంబర్లకు కాల్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్ రెడ్డి, పార్టీ 76వ వార్డు ఇన్‌చార్జి దొడ్డి రమణ, డి.ఎస్. సాయికృష్ణ, చైతన్య, రమేష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యాత్రికులకు వసతి కోసం వినతి

అగనంపూడి: వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే షిర్డీ సాయి భక్తుల కోసం వసతి ఏర్పాటుకు అవసరమైన నిధులు కేటాయించాలని అగనంపూడి షిర్డీ సాయి సేవా సమితి ప్రతినిధులు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డిని కోరారు. ఆయన్ను కలిసి వినతిపత్రం అందించారు. ఆలయం హైవేను ఆనుకొని ఉండడం వల్ల వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే యాత్రికులు ఆలయ ఆవరణలోనే స్నానాలు, అన్నపానీయాలు ఏర్పాటు చేసుకుంటున్నారని తెలిపారు. ఆవరణలో వసతి భవనం నిర్మిస్తే యాత్రికులకు సౌకర్యంగా ఉంటుందని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ప్రతినిధులు కె.రమణారెడ్డి, డి.వ్యాసశర్మ పి.సత్యనారాయణ ఉన్నారు.